



● గంజాయి విక్రయిస్తున్న బోధన్ వాసులను బాన్సువాడ కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

## జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డి టౌన్, జూలై 1: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించిన నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు.





» గంజాయి మత్తుకు బానిస అవుతున్న యువత
» జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు
» కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాల్లో రహస్యంగా అమ్మకాలు
» రాత్రి వేళల్లో గాంజా గ్యాంగుల దాడులు
» హత్యలకూ పాల్పడుతున్న వైనం
» బాన్సువాడ డివిజన్ కేంద్రంలో మాల్ పేరిట గంజాయి ప్యాకెట్లు
» మత్తులో జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్న యువత
» నిద్ర మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు

# మత్తు..చిత్తు!

బాన్సువాడ, జూలై1: గాంజా మత్తుకు యువత బానిస అవుతూ జీవితాలను చేసుకుంటోంది. ఇన్నాళ్లూ జిల్లా కేంద్రం, పట్టణ కేంద్రాలకే పరిమితమనుకున్న గంజా పల్లె ప్రాంతాలకూ పాకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు గంజాయికి బానిస అవుతున్నారు. గంజాయిని వ్యసనంగా చేసుకుని మత్తులో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపై ఇష్టారీతిన తిరుగుతూ, దాడులకు పాల్పడుతూ చివరికి గంజాయి బానిసై ప్రాణాలు తీసేలా తయారువుతున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు తమను తాము కట్టడి చేసుకోలేక తన కుటుంబాన్ని ఆగం చేస్తున్నారు. గంజాయిని సిగరేట్లలో కలుపుతూ, చాక్లెట్లు, ఇతరత్రా తినుబండారాల్లో కలుపుకుని యువతను ఆకర్షించేలా గంజాయి ముఠా రహస్యంగా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం. యువతను గంజాయి ఘాటుకు బానిసలు చేసి ధనార్జన లక్ష్యంగా కొంతమంది గంజా ముఠా సభ్యులు రాత్రి వేళల్లో రహస్యంగా కిరాణా షాపుల్లో, పాన్ షాపుల్లో చివరికి హోటళ్లలో విక్రయాలు చేపడుతున్నట్లు పలువురు యువత చర్చించుకోవడం గమనార్హం. అంతేకాకుండా కొన్నిచోట్ల గాంజా ప్యాకెట్లను విక్రయిస్తున్న ట్లు తెలుస్తోంది. రాత్రి 10 గం టల తర్వాత గంజాయికి అలవాటైన యువత రోడ్లపై విచ్చల విడిగా తిరుగుతూ ఎదురువస్తున్న ప్రయాణికులను ప్రజలపై దాడులు చేస్తూ ఆ మత్తులో హత్యలు కూడా చేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

**● మత్తులో దాడులు, బెదిరింపులు**

ఇటీవల నసురుల్లాబాద్ మండలం కొచ్చెరి మైసమ్మ ఆలయం వద్ద కొంతమంది పిట్లం మండలానికి చెందిన గంజా యికి అలవాటైన యువత ఆలయం వద్ద కర్రలతో, రాళ్లతో ఇతరులపై దాడులు చేసుకున్నారు. ఈ గంజాయి ముఠాపై కూడా బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. అలాగే ఇటీవల బాన్సువాడలో ఓ యువకుడు గంజాయికి అలవాటై ఆత్మహత్య చేసుకున్నా డు. అలాగే ఇతర గ్రామ శివారులో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ప్రయాణీకుల పైనా, బస్టాండ్ ఇతర చౌరస్తాల వద్ద ప్రయాణీకులపైనా మత్తులో యువకులు దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రాత్రివేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించని గాంజ ముఠా విచ్చలవిడిగా దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. బా న్సువాడ డివిజన్ కేంద్రంలో గంజాయి ప్యాకెట్లను మాల్ పేరిట రూ.200 నుంచి 300 వరకు రహస్యంగా విక్రయిస్తున్నట్లు సమాచారం. గతంలో ఎక్సైజ్, పోలీసుశాఖ అధికారులు దాడులు చేపట్టి గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి వదిలిపెట్టిన సంఘటనలూ ఉన్నాయి.

**● రాత్రివేళలో గాంజా ముఠా సభ్యుల దాడులు**

ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని ఆయా మండలకేంద్రాలలో గంజాయి మత్తులో బానిసలైన యువకులు రాత్రివేళలో ప్రయాణికులపై దాడులు చేస్తున్న ఘటనలు ఉన్నాయి. రాత్రివేళలో పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడంతో రాత్రి 10 తర్వాత రోడ్లపై బ్యాచ్ ముఠా సభ్యులు బైకుల్లో వెళ్తున్న ప్రయాణికులపై దాడులకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపించారు.

**● మాల్ పేరిట విక్రయాలు!**

బాన్సువాడ డివిజన్ కేంద్రంతోపాటు సరిహద్దు గ్రామాల వద్ద గంజాయి ముఠాసభ్యులు మాల్ పేరిట గాంజా ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం. సరిహద్దు ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలైన జుక్కల్ హౌరా బిచ్కుంద, పిట్లం సాలూర బాన్సువాడ ప్రా ంతాలలో విచ్చల విడిగా గాంజా ప్యాకెట్లను మాల్ పేరిట విక్రయిస్తున్నారు. రాత్రి 10గంటల తర్వాత పాన్ డబ్బాలు, హోటళ్లు తెరిచి రహస్యంగా గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్యాకెట్‌కు రూ.200 నుంచి 300వరకు రహస్యంగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బాన్సువాడలో విక్రయిస్తున్న గంజా ప్యాకెట్లపై ఉక్కుపాదం మోపి ఇతర ప్రాంతాలకు తరలివెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**● అధికారులు ఉక్కుపాదం మోపేనా?**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అక్రమంగా రహస్యంగా గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తూ ధనార్జన ధ్యేయంగా గంజాయి ముఠా సభ్యులు యువతను ఆకర్షించే గంజాయికి బానిసలు చేసి జీవితాలతను ఛిద్రం చేస్తున్న ముఠాపై పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు ఇప్పటికైనా ఉక్కుపాదం మోపాలని యువత, తల్లిదండ్రులు, ప్రజలు పలువురు కోరుతున్నారు. గంజాయికి బానిసలైన యువత తమ జీవితాలను నాశనం చేసుకుని తమ కుటుంబాన్ని కోల్పోయి వ్యసనాలకు అలవాటై చివరికి తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఆత్మహత్యలు దాడులపై ఇప్పటికైనా అలాంటివి అరికట్టేలా పోలీసు ఎక్సైజ్ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేస్తున్నారు.

### గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

● మున్నూరు కృష్ణ, పట్టణ సీఐ, బాన్సువాడ

గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై ఎవరూ తిరగవద్దు. అత్యవసరం అయితే తప్ప యువకులు తిరిగితే చర్యలు తప్పవు. పాన్‌షాపులు, హోటళ్లు రాత్రి 10 తర్వాత మూసి ఉంచాలి. లేదంటే కేసులు నమోదు చేస్తున్నాం. గాంజా ముఠాను త్వరలోనే నిర్మూలిస్తాం.

### ముఠా వివరాలు సేకరిస్తున్నాం..

● తేజస్విని, ఎస్సై ఎక్సైజ్ శాఖ, బాన్సువాడ

గంజాయి విక్రయిస్తున్న ముఠాపై నిఘా పెడతాం. వారి వివరాలను సేకరిస్తున్నాం. గతంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు దాడులు చేపట్టాం. ప్రస్తుతం అదే పనిలో ఉన్నాం. త్వరలోనే గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకుంటాం. యువత గంజాయికి దూరంగా ఉండాలి.

బాన్సువాడలో 620 గ్రాముల

## గంజాయి పట్టివేత

● ముగ్గురి రిమాండ్: డీఎస్పీ

బాన్సువాడ, జూలై1: గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 620 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ఓ వ్యక్తి గంజాయిని విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బాన్సువాడ సీఐ మున్నూరు కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని కొయ్యగుట్టలో సమీపంలో గల పీఆర్ గార్డెన్ వెనుక సీమాల శ్రీకాంత్ అనే యువకుడిని అదుపులోకి తీసుకుని, తనిఖీ చేయగా అతని వద్ద 120 గ్రాముల గంజాయి దొరికినట్లు చెప్పారు. అతన్ని పూర్తిస్థాయిలో విచారించగా బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన నస్రీన్ బేగం అలియాస్ సుమేరా బాను అనే మహిళ దగ్గర తాను గంజాయిని కొనుగోలు చేసినట్లు అతడు అంగీకరించాడు. వెంటనే బాన్సువాడ పోలీసులు బోధన్ పట్టణంలోని ఆమె ఇంటికి చేరుకుని, ఇంట్లో తనిఖీలు నిర్వహించగా, ఆమె వద్ద 500 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు వెల్లడించారు. వెంటనే ఆమెతోపాటు ఆమె మామ ఎం.డి.రషీద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, మహారాష్ట్రలోని నాయిగావ్ అనే ప్రాంతంలో నుంచి తాను గంజాయిని కొనుక్కొచ్చినట్లు రషీద్ అంగీకరించాడు. దీంతో శ్రీకాంత్, నస్రీన్ బేగం, రసీద్‌లను సోమవారం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. చదువుకునే యువత మత్తు పదార్థాలను బానిసలై, వారి జీవితాలని నాశనం చేసుకోవద్దని కోరారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి లాంటి ఇతర మత్తు పదార్థాలను అక్రమంగా విక్రయించిన, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి కేసును చాకచక్యంగా పరిశోధించి, నిందితులను అరెస్టు చేసిన బాన్సువాడ సీఐ కృష్ణ, ఇతర పోలీసు సిబ్బందిని కామారెడ్డి సీపీ సింధూ శర్మ అభినందించినట్లు తెలిపారు.

ఫిర్యాదులపై తక్షణమే

## స్పందించాలి

● ప్రజావాణికి వచ్చిన వినతులపై అధికారులతో కలెక్టర్
● జిల్లా నలుమూలల నుంచి 102 ఫిర్యాదులు

కామారెడ్డి టౌన్, జూలై 1: ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తక్షణమే స్పందించాలని అధికారులను కలెక్టర్ సంగ్వాన్ ఆదేశించారు. వినతులను క్షుణంగా పరిశీలించి పరిష్క రించదగిన వాటికి పరిష్కారం చూపాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇందు లో రెవెన్యూ శాఖకు 55, ఎంప్లాయిమెంట్ 1, ఎడ్యుకేషన్ 1, డీపీవో 5, ట్రైబల్ 2, ఆర్‌అండ్‌బీ 1, ఎలక్ట్రిసిటీ 1, ఎక్సైజ్ 1, ఫిషరీస్ 1, ఇరిగేషన్ 1, హౌజింగ్ 9, మున్సిపల్ 3, డీఆర్‌డీఓ 13, ఎస్‌పీ 3, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు 5 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రధానంగా విద్యవైద్య, బీసీ, గిరిజనసంక్షేమం, విద్యుత్, పంచాయతీ, ఫించన్లు, మున్సిపాలిటి, ధరణి తదితర అంశాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయని వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీఓ చందర్, డీపీఓ శ్రీనివాస్‌రావు, సీపీవో రాజారాం, ఎస్‌పీ కార్పోరేషన్ ఈడీ దయానంద్, జిల్లావ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్



ప్రజావాణికి వచ్చిన ప్రజలు




ఫీజులపై ఉన్న శ్రద్ధ

# సౌకర్యాలపై ఏదీ?

» ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు వక్రభాష్యం » అమలుకు నోచుకోని ప్రభుత్వ ఉత్తర్వులు
» కాగితాలకే పరిమితం అవుతున్న జీవోలు » జిల్లాలో ఎక్కడా కనిపించని క్రీడా ప్రాంగణాలు
» పొంతన ఉండని ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి » పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

కామారెడ్డిటౌన్, జూలై1: మెరుగైన ప్రమాణాలతో కూడిన విద్యను అందరికీ సమానంగా అందించాలనే ప్రభుత్వాల లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులను అమలు చేయడంలో విద్యాశాఖాధికారులకు చిత్తశుద్ధి లోపించడంతో విద్య అంగడివస్తువుగా మారిందని పేర్కొంటున్నారు. అడ్మిషన్ ఫీజు, అధికంగా పాఠశాల ఫీజు, పుస్తకాలు, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులంటూ ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల నుంచి అందినకాడికి దోపిడీ చేస్తున్నాయి. వీటిపై ఇంత శ్రద్ధ పెడుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నాయా అంటే అదీ లేదు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు మంచి విద్యను అందించి, అన్ని అంశాల్లో రాణిస్తారనే ఆశతో ఎంతైన చెల్లించడానికి వెనుకాడటం లేదు. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల ఆశలను తమ ఆదాయవనరుగా మార్చుకుంటున్నాయి.

**● కాగితాలకే పరిమితం అవుతున్న జీవోలు**

పాఠశాలల నిర్వహణకు అనుసరించాల్సిన నిబంధనలతో ప్రభుత్వాలు ఎన్నో జీవోలు విడుదలచేశాయి. ఈ జీవోలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన ప్రైవేట్ విద్యాసంస్థలు దాన్ని తుంగలో తొక్కుతూ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. నియంత్రించాల్సిన విద్యాశాఖ, ప్రభుత్వ యంత్రాంగం ప్రేక్షక పాత్రవహించడమే కాకుండా విద్యార్థి సంఘాలు ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల అమ్మకాలు, దుస్తుల అమ్మకాలు జరుపుతున్నారని విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్తే మీకు తెలవకుండా జరుగుతుందా...కొత్తగా జరుగుతుందా. ఇప్పుడు మమ్మల్ని ఏం చేయమంటారు అనే స్థాయికి దిగజారారంటే ఏ స్థాయిలో ప్రైవేట్ పాఠశాలల దందాకు సహకరిస్తున్నారో ఇట్టె అర్థం చేసుకోవచ్చు. కొన్ని పాఠశాలలు వేసవి సెలవులు ముగియకముందు నుంచే ప్రవేశాల సందడి మొదలుపెట్టింది. నర్సరీ నుంచి ప్రవేశపరీక్షలు నిర్వహించి మూడునెలలముందే సంవత్సరం ఫీజును కట్టించుకున్న పాఠశాలలు అనేకం ఉన్నాయి. ఇక అధిక ఫీజుల వసూలు చేస్తున్న అసలు అటువైపు కన్నెత్తి చూసిన సంఘటన ఎక్కడ లేకుండా పోయింది. ఫీజుల వసూళ్లకు గవర్నింగ్ బాడి ఏర్పాటుచేయాలనే అంశం ఉంటుందనేది తమకు తెలియదని విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పర్మిషన్ లేకుండా పాఠశాలలు నెలకొల్పుతున్న తల్లిదండ్రులకు ఆ పాఠశాలలు అనుమతి లేవని ప్రకటనలు విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను ఏర్పాటుచేస్తే ఆర్టికల్ 21లోని సెక్షన్‌లలోనే పొందుపరిచిన జరిమానాలను వేయాలని అంశమే విద్యాశాఖ అధికారులకు తెలియకుండా పోయింది. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు కల్పిస్తున్న సదుపాయాలు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు వివిధ అంశాల్లో పిల్లలకు ఇస్తున్న తర్ఫీదును బట్టి ఫీజులు వసూలు చేస్తున్నామని చెబుతున్న వాళ్లు చెప్పే మాటలకు అక్కడున్న వసతులకు పొంతనే ఉండడం లేదు.

**● ఉత్తర్వులు.. ఆచరణలు**

జీవో నంబర్ 1 2(2) ప్రకారం తరగతి గదులు ఆహ్లాదంగా నడిచేందుకు ఒక్కో విద్యార్థికి 6 నుంచి 8 చదరపు అడుగుల స్థలం ఉండాలి. ఆ స్థలాన్ని లెక్కగట్టి ఎంత మంది పిల్లలు ఉన్నారో దాని ప్రకారం సెక్షన్లు చేయాలి. ఆచరణలో మాత్రం దీనికి విరుద్ధంగా విద్యార్థుల సంఖ్యను బట్టి సెక్షన్లను విభజిస్తున్నారు. ఒక్కో తరగతి గదిలో 50 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటున్నారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి క్రీడా ప్రాంగణాలు ఉండాలి. ప్రాథమిక పాఠశాలకు 200 లోపు విద్యార్థులుంటే 500 చదరపు మీటర్లు, 300లోపు విద్యార్థులుంటే 600 చదరపుమీటర్లు, 400లోపు ఉంటే 800 చదరపుమీటర్లు, 500లోపు ఉంటే 1000 చ.మీ,600నుంచి వెయ్యిలోపు ఉంటే 1200 చ.మీ నుంచి 2వేల చ.మీ క్రీడా ప్రదేశం ఉండాలి. ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలకు 200లోపు విద్యార్థులుంటే 700 చ.మీ, 300 లోపు విద్యార్థులుంటే 800 చదరపు మీటర్లు, 400లోపు ఉంటే 1000 చదరపుమీటర్లు, 500లోపు ఉంటే 1200 చ.మీ,600నుంచి 1000 లోపు ఉంటే 2200 చ.మీ క్రీడా ప్రదేశం ఉండాలి. కాని కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఉన్న పాఠశాలలను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. క్రీడాప్రాంగణాలు లేకపోవడంతో విద్యార్థులు నాలుగు గోడల మధ్య కేవలం చదువుకే పరిమితమవుతూ శారీరక, మానసిక ఉల్లాసానికి దూరమవుతున్నారు. ఇక పాఠశాల భవనాలు ఒక అంతస్తు కన్నా ఎక్కువ ఉన్నవి జాతీయ భవననిర్మాణ నిబంధనలు, భారత ప్రమాణాల నిబంధనల ప్రకారం ఉండాలి. కారిడార్లు, విశాలమైన మెట్ల మార్గం, పిట్టగోడలు, బయటకు వెళ్లే మార్గాలు, ర్యాంపులు, అగ్ని నిరోధక శాఖ జాగ్రత్తలు ఉండాలి. జిల్లా కేంద్రంలోని విద్యానగర్, నిజాంసాగర్ ఏరియాతో పాటు పలు పాఠశాలలు అపార్ట్‌మెంట్లలో,భారి బిల్డింగ్‌లలో కొనసాగుతున్నాయి. గృహ అవసరాలకోసం అనుమతి ఇస్తే పాఠశాలకు ఎందుకు ఇస్తున్నారని అటు స్థానిక సంస్థల అధికారులు అడగటం లేదు. విద్యాశాఖధికారులు పట్టించుకోవడం లేదు.

**● పొంతన లేని ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి**

ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తికి అసలు పొంతన అనేదే లేకుండా పోయింది. ప్రాథమిక పాఠశాలల్లో 1:20, ఇతర పాఠశాలలో 1:40గా ఉండాలి. కాని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు అనే తేడాలేకుండా ప్రతీ సెక్షన్‌లోనూ లెక్కకు మించిన విద్యార్థులను కుర్చోబెట్టి చదివిస్తున్నారు.ముందు కూర్చున్న విద్యార్థులకు ఉపాధ్యాయులుచెప్పేది స్పష్టంగా వినిపిస్తుంది. అర్థమవుతుంది. కాని వెనుక కూర్చున్న విద్యార్థులు బోర్డుమీద చూసి రాసుకోవాల్సిందే. కొన్ని సందర్భాలలో అది కూడా కష్టతరమే అవుతుంది.విద్యావంతులైన తల్లిదండ్రులతో కలిసి ఒక గవర్నింగ్‌బాడిని ఏర్పాటుచేయాలి. ఈ బాడి పాఠశాల ప్రారంభానికి ముందు సమావేశమై వివిధ తరగతులకు వసూలు చేయాల్సిన ఫీజులను నిర్ణయించడం, ఉపాధ్యాయులు,ఉపాధ్యాయేతర సిబ్బందికి చెల్లించాల్సిన జీతాలు, విద్యార్థుల ప్రవేశాలు, సంస్థ ఆర్థిక పరిస్థితి, పరిపాలన, అకడమిక్ అంశాలపై చర్చించి నిర్ణయంతీసుకోవాలి. కాని ఎక్కడ గవర్నింగ్ బాడీలు కనిపించడం లేదు. పైగా విద్యాశాఖ అధికారులే బహిరంగంగా ఎవరు ఏర్పాటు చేస్తారనేది స్పష్టత లేదని చెప్పడం హాస్యాస్పదం. నిర్ణయాలన్నీ యాజమాన్యమే తీసుకుంటుంది. పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది జీతాలు, అద్దెలు, విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులు అన్ని పరిగణలోకి తీసుకుని దానికి అనుగుణంగా తరగతుల వారిగా ఫీజులు నిర్ణయించాలి. అయితే పాఠశాలలు మాత్రం వాటిని పరిగణలోకి తీసుకోకుండా తమ ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తున్నారు. ఫీజుల నియంత్రణకు కమిటి లేకపోవడం అసలు విద్యాశాఖపేరుకే ఉన్నట్లుగా వ్యవహరించడంతో ప్రైవేట్ విద్యాసంస్థలకు అయిన ఖర్చుల కంటే ఆదాయమే ఎక్కువగా వస్తుంది. ఇప్పటికైన విద్యాశాఖ, ఉన్నత అధికారులు ప్రభుత్వ నిర్ణయాలను అమలుచేస్తే పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు ఆర్థిక కష్టాలు తప్పనున్నాయి.






వైద్యఆరోగ్యశాఖ పుస్తకాలను విడుదల చేస్తున్న కలెక్టర్

సీజనల్ వ్యాధులపై

## అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై1: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా దోమల, ఈగల బెడద ఎక్కువవుతుందని దీంతో మలేరియా, ఫైలేరియా, డెంగి, చికెన్‌గున్యా, టైఫాయిడ్, డయారేయా, అతిసార వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన చేపట్టాలని తెలిపారు. వర్షపునీరు నిల్వ ఉండకుండా మున్సిపల్, జీపీ సిబ్బంది పనిచేసేలా అధికారులు చూడాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన పుస్తకాలను విడుదలచేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీఓ పీడీ చందర్‌నాయక్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జీటీ పోస్టుల బదిలీలు కొలిక్కి!

కామారెడ్డిటౌన్, జూలై1: జిల్లాలో జరుగుతున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టుల బదిలీలు కొలిక్కివచ్చినట్లు డీఈవో రాజు సోమవారం తెలిపారు. మొత్తం 1494మంది బదిలీకి దరఖాస్తు చేసుకోగా 1129మంది బదిలీ అయినట్లు తెలిపారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయుల పోస్టులలో ప్రభుత్వ కేటగిరి తెలుగు మీడియంలో 17దరఖాస్తులు రాగా 12మంది బదిలీ అయ్యారని, ఉర్దూ మీడియంలో 4 దరఖాస్తులు రాగా ఒకరు బదిలీఅయ్యారని పేర్కొన్నారు. లోకల్ బాడికి సంబంధించి తెలుగు మీడియంలో 1350 మంది దరఖాస్తులు చేసుకోగా 1041 మంది, ఉర్దుమీడియంలో 78మంది దరఖాస్తులు చేసుకోగా 35మంది, మారఠిలో ఐదుగురు దరఖాస్తు చేసుకోగా ఐదుగురు బదిలీ అయినట్లు తెలిపారు. అదేవిధంగా పీఈటీవో తెలుగుమీడియంలో 11మంది దరఖాస్తులు చేయగా 11మంది బదిలీ అయినట్లు తెలిపారు. తెలుగు లాంగ్వేజ్ పండిత్‌కు 8మంది దరఖాస్తు చేసుకోగా ఏడుగురు, హిందీ లాంగ్వేజ్ పండిత్‌కు 17మంది దరఖాస్తు చేసుకోగా 16మంది, పీఓసీ ఇన్‌స్పెక్టర్లు నలుగురు దరఖాస్తు చేసుకోగా ఒకరు బదిలీ అయినట్లు తెలిపారు.

# వామ్మో వానరాలు

- మండల ప్రజలను హడలెత్తిస్తున్న వానరాలు
- గుంపులుగా దాడులు చేస్తున్న వైనం
- రోజురోజుకూ పెరుగుతున్న వానర బాధితులు



భిక్కనూరులో వాహనదారులపై దాడి చేస్తున్న దృశ్యం



వాహనదారులకు వెంబడిస్తున్న వానరాలు

భిక్కనూరు, జూలై 1: అడవులను వదిలి గ్రామాల్లోకి చేరిన వానరాల బెడద రోజురోజుకు తీవ్రమవుతుంది. భిక్కనూరు మండలంలోని ప్రజలు వానరాలను చూస్తే జంకుతున్నారు. మండలకేంద్రంతో పాటుగా మండలంలోని దాదాపు అన్నిగ్రామాల్లో వానరాలు చేస్తున్న దాడులు, నష్టాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి వంటసామగ్రి, అన్నం, కవర్లలో దాచిఉంచిన వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటుగా టీవీ కెబుల్, ఫోన్ వైర్లను, ఇంటిపై గూన పెంకలను ధ్వంసం చేయడంతో పాటుగా, ఇంటిపై కప్పిన టార్పాలిన్లను చించివేస్తున్నాయి. కిరాణదుకాణాల్లో, హోటళ్లలో అయితే తిను బండారాలు, ఇతర సామాగ్రిని ఎత్తుకెళ్త దుకాణాల యజమానులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏవైపు నుంచి అవి వచ్చి దాడి చేస్తాయో తెలియక ప్రజలు బిక్కుబిక్కు మంటున్నారు. వాటిని బెదిరించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే గుంపులు గుంపులుగా వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపర్చుతున్నాయి. వానరాల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రజలు ఇళ్లకు జాలీ డోర్లు, కిరాణ దుకాణాలకు, హోటళ్లకు ఇనుప జాలీ ఫెన్సింగ్‌ను అమర్చుకుంటున్నారు. మండల కేంద్రంతో పాటుగా మండలంలోని పలుగ్రామాల్లో వానరాల దాడిలో గత రెండు, మూడు నెలల్లో 30మందికి పైగా గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. ప్రతిగ్రామంలో వాన రాల సంఖ్య రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతుంది. వాన రాల సమస్యలను పరిష్కరించాలని మండలం లోని ఆయాగ్రామాల ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉంది.

**● గుంపులుగా దాడులు చేస్తున్న వైనం...**

ఇటీవల మండలకేంద్రానికి చెందిన మహిళ తన ఇంటిముందు ఉదయం పూట వాకిలీ శుభ్రం చేస్తుండగా వానరగుంపు ఒకసారిగా ఆమెపై దాడికి దిగాయి. దింతో ఆమె చేతికి తీవ్రగాయమైంది. ఇదే గ్రామంలో ఒక వృద్ధుడు ఇంటి పక్కనే ఉన్న ఆలయానికి వెళ్తుండగా మూడు, నాలుగు వానరాలు దాడిచేసి గాయపరి చాయి. మండలకేంద్రంలోని తహీసీల్దార్ కార్యా లయం సమీపంలో కార్యాలయంవైపు నడుచు కుంటూ వెళ్లె వారితో పాటుగా వాహనాలపై వెళ్లే వారిపై దాడు చేస్తున్నాయి. ఇలా మండ ల కేంద్రంతో పాటుగా మండలంలోని దాదాపు అన్నిగ్రామాల్లో వానరాలు గుంపులు గుంపు లుగా వచ్చి దాడులు చేస్తూ ప్రజలు గాయప ర్చుతున్నాయి. చేతిలో కర్రను చూస్తే చాలు వానరం మీదుకు వస్తున్న పరిస్థితి.

**● సిద్ధరామేశ్వర ఆలయంలో నానా హంగామా**

మండలకేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆల యంలో వానరాలు నానా హంగామా సృష్టిస్తున్నాయి. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. భక్తుల చేతుల్లో ఉన్న కొబ్బరి కాయలను, ప్రసాదాలను మీద దాడిచేసి ఎత్తుకెళ్తున్నాయి. గతంలో ఇదే ఆయ లంలో వానరాల నుండి ఉపశమనం పొందేందుకు రెండు కొండెంగలను తీసుకురాగా అప్పట్లో కొంత సమస్య పరిష్కారం అయ్యింది. ప్రస్తుతం కొండెంగలు లేకపోవడంతో వానరాలు మళ్లి ఆలయంలో తిష్టవేశాయి. సిబ్బంది కానీ, భక్తులు కానీ వాటిని వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తే పలువురిపై దాడులు చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి.

**● నెల రోజుల్లో 11మందికి చికిత్స...**

భిక్కనూరు మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన 11మంది జూన్ నెలలో వానరాల దాడిలో గాయపడి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకున్నారు. వానరాలతో పాటుగా కుక్కల దాడిలో గాయపడిన 16మంది, ఎలుక కరిచిన 8మందికి చికిత్స అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కాగా గత మూడు నెలలుగా 35మందికి పైగా కేవలం వానరాల దాడిలో గాయపడినట్లు సమాచారం.

### వానరాలు కరిచిన వెంటనే ఏఆర్‌వీ తీసుకోవాలి

రేబిస్ వ్యాధి ఒక్కసారి సోకితే దానికి చికిత్స లేదు. అందుకే వానరాలతో పాటుగా కుక్కల దాడిలో గాయపడిన వారు వెంటనే ఏఆర్‌వీ ఇంజెక్షన్‌ను తప్పకుండా తీసుకోవాలి. ముందుగా వానరం కానీ, కుక్క కానీ, ఎలుక కానీ కరిచిన ప్రదేశాన్ని శుభ్రంగా కడగాలి. అనంతరం గాయం తీవ్రతను బట్టీ ఏఆర్‌వీ ఇంజెక్షన్‌ను ఇవ్వడం జరుగుతుంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే కామారెడ్డికి ఏరియా ఆసుపత్రికి రిపర్ చేయ్యడం జరుగుతుంది.

- యేమిమా, మండల వైద్యాధికారిణి భిక్కనూరు

# మల్లుపేట సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

● 50 మీటర్ల దూరంలో ఎగిరి పడ్డ ట్రాక్టర్ ● ఇద్దరు యువకుల మృతి



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన యువకులు



రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన ట్రాక్టర్

సదాశివనగర్, జూలై 1:ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనకాల నుంచి లారీ అతివేగంగా ఢీకొనడంతో ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరు యువకులు మృతి చెందగా.. అతి వేగానికి ట్రాక్టర్ 50మీటర్ల దూరంలో ఎగిరిపడిన సంఘటన సదాశివనగర్ మండలంలోని మల్లుపేట దాబా సమీపంలో 44వ జాతీయ రహాదారిపై సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గాంధారి మండలం కాటాడతాండాకు చెందిన దేవిసింగ్(24), రవీందర్(23) తన ట్రాక్టర్‌పై కామారెడ్డికి పనినిమిత్తం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మండలంలోని మల్లుపేట్ శివారులోని దాబా సమీపంలో 44వజాతీయరహదారిపై అదేవైపు వెళ్తున్న లారీ అతి వేగంగా ఢీకొట్టింది. ట్రాక్టర్ 50మీటర్ల దూరంలో రోడ్డుకిందకు పడిపోగా.. రవీందర్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందగా, దేవిసింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా దేవిసింగ్ సైతం మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిపోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కార్యదర్శులు సమయపాలన పాటించాలి

భిక్కనూరు, జూలై 1: గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలలల ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిఇంటికి వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, మురికికాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతీ మంఢళవారం, శుక్రవారం గ్రామంలో ఫాగింగ్ చేయించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాత హరిజనవాడలో రేషన్ దుకాణం ప్రారంభం

భిక్కనూరు, జూలై 1: మండలకేంద్రంలోని పాతహరిజనవాడ లో రేషన్ దుకాణాన్ని సోమవారం కాలనీపెద్దలు, సమాచార హక్కు చట్టం ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలోని రేషన్‌దుకాణాన్ని కొన్నిసంవత్సరాల ఇక్కడి నుండి సుభాష్‌గల్లికి తరలించారు. దీంతో ప్రతినెలా రేషన్ సరుకులు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోనే వాళ్లమని, సమాచార హక్కు చట్టం కన్వీనర్ రవీందర్, కాలనీలోని యువకులు ఉన్నతాధికారులు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా తిరిగి తమ కాలనీలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, సమాచార హక్కు ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

భిక్కనూరు, జూలై 1: భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శోభరాణి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ సిబ్బంది సమయ పాటన పాటించాలని, వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి గర్భిణీ ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ క్యాక్రమంలో మండల వైద్యాధికారిణీ యేమిమా, సిబ్బంది పాల్గొన్నారు.

## బీర్కూర్‌లో సంత్ గులాబ్ బాబా జయంతి

బీర్కూర్, జూలై 1:బీర్కూర్ మండల కేంద్రంలోని తోట్ల హనుమాన్ ఆలయ సన్నిధిలో సోమవారం సంత్ గులాబ్ బాబా జయంతి వేడుకలను కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సం ఖ్యలో తరలి వచ్చి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం హారతి కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో గులాబ్ బాబా కమిటీ అధ్యక్షులు మాదప్ప, సంతోష్, రాజు, రాజశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ మరమ్మతుల పనుల పరిశీలన

బాన్సువాడటౌన్ , జూలై 1: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ మరమ్మతుల పనులను సోమవారం మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ పరిశీలించారు. వానాకాలం దృష్ట్యా వైర్లు బయటకు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నార్ల ఉదయ్ , చరణ్‌రెడ్డి , మల్లికార్జున్ తదితరులున్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన చందూర్ నాయకులు

వర్ని,జులై1: బీఆర్ఎస్ పార్టీని వీడి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి మొదటిసారి బాన్సువాడకు విచ్చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని సోమవారం చందూర్ మండల నాయకులు కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సంతృప్తిగా ఉందని అందుకు ఆ పార్టీలో చేరడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యేతో చెప్పినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అంబర్‌సింగ్, విండో ఛైర్మన్ అశోక్ యాదవ్, ఎంపీపీ లావణ్య, నాయకులు సాయిరెడ్డి, పోతరాజు శ్రీనివాస్, గుర్ల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## వర్ని లయన్స్ కార్యవర్గం ఎన్నిక

వర్ని, జులై1 : మండల లయన్స్‌క్లబ్ 2024-25 నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కామెపల్లి ఠాగూర్, సెక్రెటరీగా జాస్తి శ్రీనివాస్ రావు, ట్రెజరర్‌గా కటకం శివరాజులు ఎన్నికయ్యారు. మరో 50 మంది సభ్యులుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో భాగంగా వల్లూరి గణపతి సమక్షంలో డాక్టర్స్ డే నిర్వహించారు. వైద్యులు కృష్ణ ప్రసాద్, వంశీకృష్ణలను సన్మానించారు.

## అంత్యక్రియలకు యువకుల సాయం

కోటగిరి, జులై 1 : మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన జల్లా సాయిలు అనే వ్యక్తి ఫిట్స్ వ్యాధితో మృతిచెందాడు. కోటగిరికి చెందిన రవి యువసేన ఆధ్వర్యంలో వారు ఆ కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు రవి, సంతోష్, వినోద్, యోగేష్, హన్మాండ్లు, కిష్టయ్య, రాజు, ఆనంద్, బ్రాహ్మం పాల్గొన్నారు.

## 'విధులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

పెర్కిట్, జూలై 1 : పాఠశాల విధులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ పట్టణంలో ఆత్రేయ పాఠశాల యాజమాన్యం సోమవారం ఎంఈవోకు రాజగంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వారికి పలువురి నుంచి నిజనిర్ధారణ లేని ఆరోపణలు వచ్చాయని, ఆ ఆరోపణలకు తగిన సమాధానం చెబుతామని తెలిపారు. అదే విధంగా పాఠశాల విధులకు అటంకం కలిగిస్తూ ఇబ్బందికి గురి చేస్తున్నారని వినతిపత్రంలో తెలిపారు.

## వ్యవసాయ కూలీలకు పింఛన్ ఇవ్వాలి

నందిపేట, జూలై 1: బీడీ, గీతా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న నెలకు రూ.2,016 పింఛన్‌ను వ్యవసాయ కూలీలకు ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీప్రకారం రైతులకు రూ.12వేల పింఛన్ అందజేయాలని సూచించారు. అంతేకాకుండా బీడీ కార్మికులు, గీతా కార్మికులకు రూ.4,016 పింఛన్‌ను పెంచి ఇవ్వాలని గంగాధర్ డిమాండ్ చేశారు. ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని, రైతులు బంగారు అభరణాలపై తీసుకున్న రుణాలను సైతం మాఫీచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజలింగం, కార్యదర్శి దేవన్న, ఉపాధ్యక్షులు జి.కూషన్న, సభ్యులు వంజరి గంగాధర్, ఉమ్మెడ గంగాధర్ తదితరులున్నారు.

## దోస్త్ అడ్మిషన్‌లపై విస్తృత ప్రచారం

మోర్తాడ్, జూలై1: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పెద్దన్న ఆధ్వర్యంలో సోమవారం దోస్త్ డిగ్రీ అడ్మిషన్‌లకై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. డిగ్రీ కళాశాల లెక్చరర్‌ల కోసం రెండు రూట్లుగా విభజించుకొని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తూ ఫెక్సీలు ఏర్పాటు చేశారు. దొన్కల్, శెట్‌పల్లి, దర్మోరా, గాండ్లపేట్, బషీరాబాద్, చౌట్‌పల్లి, హసాకొత్తూర్, నాగాపూర్, అంక్సాపూర్ గ్రామాల్లో ఒక బృందం ప్రచారం చేయగా రెండో బృందం తాళ్ళరాంపూర్, గుమ్మిర్యాల్, దోంచంద, తడ్‌పాకల్, నాగేంద్రనగర్, బట్టాపూర్, గుమ్మిర్యాల్ తాండాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవీన్, స్రవంతి, లెక్చరర్‌లు పాల్గొన్నారు.

## 'కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలి'

బోధన్‌రూరల్,జులై1: జూలై 1 నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని, ఆ కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని హిట్ అండ్ రన్ కేసులో ఇక కటకటలేనని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఒకరి మృతికి కారణమై ప్రమాద స్థలం నుంచి పారిపోతే 106(2)బీఎన్ఎస్ ప్రకారం రిమాండ్‌కు పంపుతామని, నిరూపణ అయితే 10సంవత్సరాల జైలు శిక్ష తప్పదన్నారు. ప్రమాద స్థలం నుంచి పారిపోకుండా పోలీసుస్టేషన్‌లో, లేదా కోర్టులో లొంగిపోతే నేర నిరూపణ అయితే 5సంవత్సరాల పాటు జైలుశిక్ష ఉంటుందన్నారు. ప్రజలు కొత్త చట్టాలపై అవగాహన కలిగిఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు.

## రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌కు సన్మానం




సుంకెట అన్వేష్‌రెడ్డిని సన్మానిస్తున్న సొసైటీ పాలకవర్గం

వేల్పూర్, జూలై1: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలోని సొసైటీలో సోమవారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డిని సొసైటీ ఛైర్మన్ లింబారెడ్డి, డైరెక్టర్‌లు శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా సొసైటీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా అన్వేష్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం సభలో అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. అనంతరం రైతుల అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, వ్యవసాయాధికారి నర్సయ్య, సెక్రెటరీ స్వామి, డైరెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణ

భిక్కనూరు, జూలై 01: భిక్కనూరు మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు బీఆర్ఎస్ ఎంపీటీసీలు, విండో ఛైర్మన్లు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి రాజ్యాంగబద్ధమైన హోదాలేని షబ్బీర్‌అలీని అహ్వానించడం ఏమి టని, అతడి స్థానంలో స్థానిక ఎమ్మెల్యే రమణారెడ్డిని ఆహ్వానించిన గౌరవంగా ఉండేదని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ యాదగిరి, ఎంపీటీసీలు, విండో ఛైర్మన్లు పాల్గొన్నారు.

## సిద్దులగుట్టపై పల్లకీసేవ, ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌రూరల్, జూలై1: పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సిద్దులగుట్టపై సోమవారం పలకీసేవ, ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే సిద్దులగుట్టకు తరలివచ్చి శివాలయంలో సిద్ధేశ్వరునికి, రామాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పైపుల రాజారెడ్డి సిద్దులగుట్టపై నూతనంగా నిర్మించిన షెడ్డులో మార్బుల్ టైల్స్, ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమానికి వంట చేయడానికి వంట గది నిర్మాణానికి దాతగా వ్యవహరించారు. సోమవారం సిద్దులగుట్ట దర్శనానికి వచ్చి పైపుల రాజారెడ్డికి అలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆయన వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించి గుట్టపై చేపడుతున్న పనులను పరిశీలించి ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డి.సుమన్, వీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, సతీష్, చరణ్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, జిమ్మిరవి, కొంతం మురళీ పాల్గొన్నారు.

## 'వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

బోధన్‌రూరల్,జులై1: అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల పెన్షన్ పెంచుతామని మాట ఇచ్చిందని, వికలాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌లు పెంచాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని బెల్లాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు 4వేల నుండి 6 వేలు పెన్షన్ పెంచాలని, వృద్దులు, వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌లు పెంచాలని డిమాండ్ చేశారు.

# రోగులకు మెరుగైన సేవలు అందించాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారంరాథోడ్

నవీపేట,జులై1: ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. పలు వార్డులను సందర్శించి రోగుల ఆరోగ్యంపై వాకబు చేశారు. ఆసుపత్రిలో నార్మల్ డెలవరీల సంఖ్యను పెంచాలని కోరారు. ఆసుపత్రి ప్రాంగణంలో కొంత స్థలాన్ని పలువురు అక్రమించుకుంటున్నారని వైద్య సిబ్బంది ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. జాతీయ డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌తో పాటు మెడికల్ ఆఫీసర్లు కావ్య, సామ్రాట్ యాదవ్, అరవింద్‌లను సిబ్బంది శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిషన్, వెంకటేశ్వర్ రావు, ఝాన్సీ ప్రేమలత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోతో పాటు వైద్యులను సన్మానిస్తున్న సిబ్బంది

# ఘనంగా డాక్టర్స్ డే




కోటగిరిలో వైద్యాధికారిని సన్మానిస్తున్న దృశ్యం



నందిపేటలో డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్ , జూలై1: పట్టణంలోని లయన్స్‌క్లబ్ భవన్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వనిత, డాక్టర్ భుజంగరెడ్డి, డాక్టర్ హరిష్‌లతో పాటు చార్టడ్ అకౌంట్ ఈరవత్రి రాజశేఖర్‌ను పట్టుశాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుశేఖర్, డాక్టర్ రాకేష్, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ శ్రీలతలను పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పొల్కం వేణు, కార్యదర్శి సంతోష్, అశోక్, చేపూర్ గణేష్, డికె.రాజేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.పట్టణంలోని మెగా టవర్స్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్‌లను సన్మానించి డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ లిఖితలను మెగా టవర్స్ సభ్యులు పట్టుశాలువ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెగా టవర్స్ అధ్యక్షుడు జెస్సు అనిల్, సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు అపర్ణ, ప్రకాష్‌లను శాలువతో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో పూర్వవిద్యార్థి డాక్టర్ మౌనికరెడి, డాక్టర్ గణేష్‌రెడ్డిలు డాక్టర్స్ డే సందర్భంగా ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పాఠశాలలో సుమారు 300మంది విద్యార్థులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీ ఫౌం డేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్, డాక్టర్ హరినారాయణ, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వెంకట్‌గౌడ్ దంపతులు, డాక్టర్ ముత్యంరెడ్డి దంపతులు, డాక్టర్ రాజు, డాక్టర్ రాంప్రసాద్; డాక్టర్ అజయ్‌లతో పాటు చార్టర్డ్ అకౌంటెంట్ మారుతి, పవన్‌లను ఆయన పట్టుశాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బెల్దారి శ్రీనివాస్, డిజె.సునీల్, బోడమీది కిషన్, తదితరులు పాల్గొన్నారు.

**కోటగిరి :** మండల కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో కోటగిరి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యురాలు సుప్రియ, సూపర్‌వైజర్ జ్యోతిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వైద్యులు దేవుళ్లతో సమానమని, వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని సభ్యులు కొనియాడారు. వైద్యవృత్తిలోకి వచ్చిన వారు ఎందరో రోగుల ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నా వైద్యుల కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ అధ్యక్షులు హన్మంత్‌రావు, కార్యదర్శి సంతోష్, రవి, శివ చరణ్, మహ్మద్ అలీ, ఉమాకాంత్, సందీప్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

**మోర్తాడ్:** మోర్తాడ్ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని, డాక్టర్‌ల సేవలకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు లక్ష్మీ, పూజ, ఫార్మసిస్టు సంజీవ్‌కుమార్, గంగాధర్‌గౌడ్, ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

**నందిపేట:**మండల కేంద్రంలోని ఆర్మూర్ బైపాస్ రోడ్డులో ఉన్న లయన్స్ భవనంలో సోమవారం డాక్టర్స్‌డేను ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్‌లను నందిపేట లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రైవేట్ డాక్టర్లను సైతం సన్మానించారు. డాక్టర్లు దేవుళ్ళతో సమానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శౌరిబాబు, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ కోశాధికారి నర్సయ్య, సభ్యులు ఉత్తూర్ సురేష్, బద్దం సాయారెడ్డి, పి రాజన్న, గంగోని ప్రేమ్‌కుమార్, మారంపల్లి గంగాగౌడ్, గంగుల జనార్ధన్, డాక్టర్ షాబీర్, నారాయణ, గంగాప్రసాద్, గంగుల గంగాదర్, జగన్ గౌడ్ తధితరులు ఉన్నారు.

**పెద్దబజార్:** వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శిక్షణ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవృత్తిలో ఉన్న వారు దైవంతో సమానమని ప్రజలు నమ్మేలా ప్రజలకు వైద్య సేవలను అందించాలన్నారు. సన్మాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఇరుకుల వీరేశం, లక్ష్మీనారయణ, లింబాద్రి రవీంద్ర నాథ్ గుప్త, చింతల గంగాదాస్, వైద్యులు రాజేశ్, తేజస్వీ, బొద్దుల రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, డీఎల్ఎన్ స్వామి, నీలిరాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్ :** కరోనా కష్టకాలంలో వైద్యుల సేవలు మరువలేనివని లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ శక్కర్‌నగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా వైద్యులను సన్మానించారు. కరోనా మహమ్మారిలో వైద్యులు తమ ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలు కాపాడారని వారి సేవలను కొనియాడారు.

## 'ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాల కార్మికులను గుర్తిస్తున్నాం'

ఖిల్లా, జూలై 1 : పోలీసు శాఖలో ఆపరేషన్ ముస్కాన్ కార్యాక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని అదనపు డీసీపీ బి.కోటేశ్వర్‌రావ్ (అడ్మిన్) అన్నారు. రాష్ట్ర అదనపు డీజీపీ మహిళా భద్రతా విభాగం షికాగోయల్ సూచనల మేరకు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ ఆదేశాలపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. సమీక్ష సమావేశం పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లో వివిధ శాఖల సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ పరిధిల్లో 18 ఏళ్ల లోపు తప్పిపోయిన/వదిలివేయబడిన/కార్మికులుగా ఉన్న బాలబాలికలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని సేకరించి రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలని, బలవంతంగా భిక్షాటన చేయించిన, వెట్టిచాకిరి చేయించిన వారిపై తగిన క్రిమినల్ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేకం గా డివిజన్ పరిధిలో ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం తప్పిపోయిన బాలబాలికలున్నట్లయితే డయల్ 100కు అయా పోలీసుస్టేషన్ల పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజ్, యాంటిహ్యూమన్‌ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ సురేష్, జిల్లా లేబర్‌ఆఫిసర్ యోహన్, జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సంపూర్ణ, డీఎమ్‌హెచ్‌వో తుకారాం రాథోడ్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య, ఆర్ఎస్ఐ స్రవంతి, హన్మాండ్లు, బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ స్థాయి సర్కిల్ టోర్నీ విజేతగా పురాణిపేట్ టీమ్

భీమ్‌గల్ రూరల్, జూలై01 : మండలంలోని పురాణిపేట్ గ్రామంలో వారం రోజులుగా నిర్వహించబడుతున్న సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొన్నాయి. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్‌ను ఎంచుకున్న బాబాపూర్ జట్టు నిర్ణీత 6 ఓవర్లలో 65 రన్స్ చేయగా ఆ లక్ష్యాన్ని పురాణిపేట్ టీం 5.3 ఓవర్లలో చేజించింది. మొదట బహుమతి పొందిన పురాణిపేట్ టీంకు ముఖ్య అతిధిగా విచ్చేసిన డైడి సురేష్, సుంకరి గాంధీ విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా 8 వేలు, రెండవ బహుమతిగా 4 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా డైడి సురేష్ మాట్లాడుతూ ఆటలో గెలుపుఓటములు సహజమని, ఓడిన వారు గెలుపుని స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని అన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

బోధన్‌రూరల్,జులై1: బోధన్ పట్టణంలో సోమవారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా నాగేశ్వర్ రావు, కార్యదర్శి ఉమేష్ షిండే, కోశాధికారిగా పండును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు, లయన్స్ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం పట్టణంలోనే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల్లోని గ్రామాలలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వర్ రావు మాట్లాడుతూ లయన్స్ సేవలను విస్తృతం చేస్తామని, నిరుపేదలకు సహాయ, సహకారాలు అందించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే సహకారంతో బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలి

● జక్రాన్‌పల్లి మండలం మహాజన సభల్లో రైతులు

జక్రాన్‌పల్లి, జూలై1: పది ఎకరాల వరకు పంట సాగు భూములకే రైతు భరోసా పథకంపై రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతుభరోసా కింద సహాయం అందించాలని రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. సోమవారం మండలంలోని అర్గుల్, బ్రాహ్మణ్‌పల్లి సింగిల్ విండోలలో, అలాగే కొలిప్యాక్ సింగిల్‌విండో పరిధిలోని కలిగోట్ రైతువేదికలో విండో ఛైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, అన్వేష్‌రెడ్డి, నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేక విండో మహాజన సభలను నిర్వహించారు. అర్గుల్‌లో జరిగిన మహాజన సభలో రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పంట సాగు కోసం పెట్టుబడి కింద రైతు భరోసా పథకంలో రైతులకు అందించే సహాయాన్ని పది ఎకరాల వరకు పంటలు సాగు చేసుకునే భూములకే రైతు భరోసాను ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయాలను డీసీవోకు శ్రీనివాస్‌రావుకు వివరించారు. గుట్టలు, వెంచర్‌లు, సాగులో లేని భూములకు రైతుభరోసా ఇవ్వవద్దని రైతులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని డీసీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ లు ఆర్మూర్ గంగారెడ్డి, అన్వేష్‌రెడ్డి, నాగుల శ్రీనివాస్, వ్యవసాయాధికారిణి దేవిక, క్లస్టర్ అధికారి పోశన్న, ఆడిట్ అధికారి రమేష్, మానిటరింగ్ అధికారి ఆనంద్, సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ అప్పాల నడ్పి రాజన్న, సీఈవోలు కొత్త దయాసాగర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

## యానంపల్లిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

డిచ్‌పల్లి, జులై 1: పక్కా సమాచారం మేరకు డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి గ్రామంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచిన గదిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు చేసి గదిని పరిశీలించారు. అప్పటికే గదిలో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పలువురు ఇతర ప్రాంతాలకు తరలించినట్లు తెలిసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వ హించారు. అద్దెకు ఇచ్చిన గది యాజమాన్యంతో మాట్లాడి బియ్యం నిల్వలను నిల్వ ఉంచితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ బియ్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి తమకు సమాచారం ఇవ్వాలని ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి సూచించారు.

## నగరంలో నేలకొరిగిన భారీ వృక్షం



నేలకొరిగిన భారీ వృక్షం

సుభాష్‌నగర్, జూలై, 1: నగరంలో భారీ వృక్షం నేలకొరిగింది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వృక్షం నేలకొరిగింది. నగరంలోని బస్వాగార్డెన్‌కు వెళ్లేదారిలో భారీవృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌కు కొద్దిసేపు ఇబ్బంది కలిగింది. దశాబ్దాలుగా భారీ వృక్షం ఎలాంటి గాలివాన లేకుండానే పడిపోవడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. అటువైపుగా వృక్షం కిందపడినప్పుడు ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో జేసీబి సహాయంతో సిబ్బంది వృక్షాన్ని తొలగించారు

## అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే : ధన్‌పాల్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పెద్దబజార్, జూలై, 1:నగరంలోని కోటగల్లీలో గల కోటమైసమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్లేనని తెలిపారు. కోటగల్లి అమ్మవారి ఆశీర్వాదం అందరి ప్రజలపై ఉండాలని, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యలతో ప్రజలందరు సంతోషంగా ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ కమిటీ వాసులు అర్బన్ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కన్వీనర్ సిరిగాద ధర్మపురి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి పన్నాటి కార్తిక్, నర్సింగ్, చింతకాయల రాజేందర్, భూలక్ష్మి, గంగామణి, నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. .

## 'బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేకుండా పింఛన్లు ఇవ్వాలి'

పెద్దబజార్, జూలై, 1 : బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేకుండా రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని తెలంగాణ ప్రగతీ శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతభూమేశ్వర్, ప్రధానకార్యదర్శి సూర్యశివాజీలు అన్నారు. నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 8నుంచి 15 వరకు అన్ని జిల్లాలో కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము అధికారంలో వస్తే బీడీ కార్మికులకు చేయూత పథకం కింద రూ.4వేలకు ఇస్తామని ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించారని అన్నారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెరగడం లేదని అన్నారు. గత 14ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు జీవో విడుదల చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల రాములు, ఖాజామోయినోద్దీన్, గంగాధర్, జెపీ గంగాధర్, శివకుమార్, రాజేశ్, పద్మ, సుప్రీయ, దేశెట్టి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

ఖిల్లా, జూలై, 1 : వివిధ కారణాలతో పోగోట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు సోమవారం మూడోటౌన్ ఎస్ఐ.ఎల్.ప్రవీణ్‌కుమార్ అందించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని సీఐఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుని వాటిని ట్రాక్‌చేసి గుర్తించడం జరిగిందని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గుర్తించిన మొత్తం 13 సెల్‌ఫోన్లను వారి వారికి ఇవ్వడం జరిగిందన్నారు. వీటిని గుర్తించడంలో ప్రతిభ కనబర్చిన మహిళ కానిస్టేబుల్ సుమలతను సీఐ.నరహరి అభినందించారని తెలిపారు.

## బాల్కొండ ఎస్సైగా మోహమ్మద్ యాసిర్ అరాఫత్

ముప్కాల్, జూలై1: బాల్కొండ నూతన ఎస్సైగా మోహమ్మద్ యాసిర్ అరాఫత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై గోపి నిర్మల్‌కు బదిలీ కాగా మోహమ్మద్ యాసిర్ అరాఫత్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని అందరి సహకారంతో చట్ట పరిధిలో పని చేస్తానని తెలిపారు.

## టీయూ హాస్టళ్లకు కొనసాగుతున్న మరమ్మతులు

డిచ్‌పల్లి,జులై 1: తెలంగాణ విశ్వవిద్యాలయంలో హాళ్లల్లో మౌలిక వసతుల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి తెలిపారు. ప్రతి ఏడాది వర్సిటీలో హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపడుతామని అందులో భాగంగా ఈ ఏడాది మరమ్మతులు చేపట్టామని తెలిపారు. గ్రూప్ 1 పరీక్షల నిమిత్తం విద్యార్థుల కోరిక మేరకు వీసీ ఆదేశాలతో ఈ సంవత్సరం వేసవి కాలంలో సెంట్రల్ లైబరిలో కూలర్లుఏర్పాటు చేయించి పుస్తకాలను ఉంచి తెరిచి ఉంచమని తెలిపారు. పోటీ పరీక్షలకు అర్హత లేక సిద్దంగా లేని విద్యార్థులు సొంత ఇళ్లకు వెళ్లిన్నందున ఆ రూములకు తాళం విద్యార్థులు వేయడంతో ఆ గదులకు మరమ్మత్తులు చేయలేదని త్వరలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిచ్‌పలి,జులై 1: అన్ని గ్రామాల కార్యదర్శులు వర్షకాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ రాకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రతి రోజు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీందర్ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు మంచి నీటి సరఫరాలో జాగ్రత్తలు వహించాలని ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో అత్యధిక మొక్కలునాటి జిల్లాలో మండలాన్ని ముందంజలో ఉంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీవో సధాకర్, కార్యదదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నూతన అధ్యక్షుడి ఎన్నిక

సుభాష్‌నగర్, జూలై, 1 : రోటరీక్లబ్ ఆఫ్ జేమ్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, గౌరీశంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీక్లబ్ గవర్నర్ హరీస్మరణ్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల అధికారి అశోక్ నూతన అధ్యక్ష, కార్యదర్శులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ జిల్లాలో రోటరీక్లబ్ జేమ్స్ సభ్యులు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వఅధ్యక్షుడు భూలోకం విజయకాంత్‌రావ్, ప్రాజెక్ట్ ఛైర్మన్ కోటగిరి చంద్రశేఖర్, వీరబ్రహ్మం, అనంత్‌కులకర్ణి, తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిని తొలగించాలని వినతి

నవీపేట,జులై1: ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం తహసీల్దార్ నారాయణను కోరారు. ఈ మేరకు వారు మండల రెవెన్యూ కార్యాలయానికి తరలివెళ్లారు. నవీపేటలోని రాంపూర్ చౌరస్తా నుంచి పాత యూనియన్ బ్యాంకు వరకు పలుచోట్ల వర్షపు నీరు నిలిచి ఉండడంతో వాహనదారులతో పాటు దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో తహసీల్దార్ నారాయణ పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు ఫోన్ చేసి రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని తొలగించాలని ఆదేశించారు.

# సమస్యలు పరిష్కరించేందుకే 'ప్రజావాణి'



ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న తహసీల్దార్



మద్నూర్ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

పెద్దకొడప్‌గల్, జూలై 1: మండలంలో ఉన్న ప్రజల సమస్యలు తీర్చేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ దశరథం తెలిపారు.సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజావాణి నిర్వహిస్తున్నామని తెలిపారు.రెవిన్యూకు సంబంధించి ఆరుదరఖాస్తులు రాగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

● ప్రజావాణికి ఆలస్యంగా అధికారులు

మండల ప్రజల సమస్యలు తీర్చేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే సోమవారం పెద్దకొడప్‌గల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెవిన్యూ, ఎంపిడివో, ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ అధికారులు మాత్రమే సకాలంలో హాజరయ్యారు. మిగతా శాఖలకు చెందిన అధికారులు తమకు ఏం పట్టనట్టుగా ఆలస్యంగా హాజరయ్యారు. సమస్యలు పరిష్కరించే అధికారులు ఇలా చేస్తే ఎలా అని మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**మద్నూర్:** ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని ఆయా శాఖల అధికారుల చేత పరిష్కరించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనడంతో సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఇప్పటి వరకు పరిష్కరించామని తమ పరిధిలో లేని వాటిని జిల్లా అధికారులకు నివేదికలు పంపించనున్నట్లు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో రాణి, ఏపీఎం మనోహర్, ఏపీవో పద్మ, మండల వ్యవసాయ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

**భిక్కనూరు:** భిక్కనూరు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి సోమవారం ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రెవిన్యూకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ఎల్లయ్య, ఆయశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: జుక్కల్ ఎమ్మెల్యే

మద్నూర్,జూలై 1:విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద ఎక్లారా బాలి కల గురుకుల పాఠశాలలో నియో జకవర్గంలోని ఆశ్రమ, గురుకుల, నవోదయ పాఠశా లల్లో ప్రిన్సిపాల్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుందని అందులో భాగంగానే నియోజకవర్గంలోని ప్రిన్సిపాల్‌లతో సమావే శం నిర్వహించి సమీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ని యోజక వర్గంలోనిఆశ్రమ, గురుకుల, నవోదయ పాఠశాల ల్లో చదువు తున్న విద్యార్థులతో పాటు ప్రభుత్వ పాఠశా లల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి నియోజకవర్గానికి పేరు తెచ్చే విధంగా వారిని తీర్చిదిద్దా లని సూచించారు. ఆశ్రమ గురుకుల పాఠ శాలల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వెనుకబడి ఉన్న జుక్కల్ నియోజక వర్గంలో గత ప్రభుత్వం విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిం చలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి రాగానే డీఎస్సీ ప్రకటించినట్లు గుర్తుచేశారు. పాఠశాలల్లో ఉపా ధ్యాయులను భర్తీ చేయడానికి నోటిఫి కేషన్ వేసినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో ఉపాధ్యాయులను నియమించనున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

# కబ్జా కోరల్లోకి కోతుల ఆహారశాల స్థలం

● పట్టించుకోని అటవీశాఖాధికారులు

గాంధారి,జూలై 1:కోతులకు సరైనా ఆహారం దొరకక గ్రామాలలోకి వచ్చికిష్కిందకాండను సృష్టిస్తున్నాయనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఆహారశాలను ఏర్పాటు చేశారు.ఈ క్రమంలోనే గాంధారి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆహారశాల కబ్జాకోరల్లోకి వెళ్తుంది అయిన అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామశివారులో సుమారు 3ఎకరాలలో ఆహారశాలను ఏర్పాటుచేశారు.అయితే గత సంవత్సరం కొంత మంది కబ్జాదారులు ఆ స్థలాన్ని దున్నే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని కేసులు నమోదుచేశారు. యాదావిధిగా అక్కడ కోతుల ఆహారశాలను ఏర్పాటు చేశారు.కాని గత కొద్దిరోజుల నుంచి మళ్లి కబ్జాదారులు దున్నిఅందులో పంటను వేశారు. అయినా అటవీశాఖాధికారులు అటువైపు కన్నెతి చూడడం లేదని ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇదేకాదు అటవీభూమిని వేల ఎకరాలలోనే చదును చేస్తు కబ్జాచేస్తున్న అడిగే నాధుడే లేకుండా పోయాడు.పెద్దపెద్ద వృక్షాలను నేలమట్టం చేస్తూ పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లతో దున్ని మొక్కజొన్న, సోయాపంటను సైతం వేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి అటవీశాఖాధికారుల నిర్లక్ష్యంపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.



కోతులకోసం ఏర్పాటుచేసిన ఆహారశాల స్థలం(ఫైల్)

# 'పది ఎకరాల వరకు రైతు బంధు పథకం అమలు చేయాలి'



తాండూర్ సొసైటీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట, జూలై 1 : ప్రభుత్వం రైతులకు అందించే రైతు బంధు పథకాన్ని పది ఎకరాల వరకు అమలుచేయాలని నాగిరెడ్డిపేట మండల రైతులు కోరారు. సోమవారం మండలంలోని మాల్తుమ్మెద, తాండూర్, కిచన్నపేట్ సొసైటీలలో రైతు బంధుఅమలు మార్గదర్శకాలపై రైతుల అభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులుసాగు చేస్తున్న పది ఎకరాల వరకు సాగు భూములున్న రైతులందరికీ రైతు బంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సాగుకుయోగ్యంగా లేని భూములకు, బీడీ భూములకు, పడావు భూములకు, కొండలు, గుట్టల భూములకు, రియల్ ఎస్టేట్ భూములకు ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేయవద్దని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.పారిశ్రామిక వేత్తలకు, ప్రభుత్వ అధికారులకు రైతు బంధు పథకాన్ని ఇవ్వోద్దన్నారు. రైతులు సాగు చేసే భూములకు ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అందించాలని వారు కోరారు.ఈసమావేశంలో స్థానిక జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుబంధు పథకం రైతులకు ఎంతో ఉపయోగకరమైందని, ఈపథకం దుర్వినియోగం కాకుండా అర్హత కలిగిన రైతులకే ఈ పథకాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే సన్న రకాల వడ్లకే కాకుండా దొడ్డు రకాల వడ్లు పండించే రైతులకు కూడా ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని రైతులు కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, సహకార సంఘం ఆడిట్ అధికారి రామ్మోహన్, ఏడీఏ వీరాస్వామి, ఏవో విజయ శేఖర్, సొసైటీల సీఈవోలు జైపాల్‌రెడ్డి, పవన్, వివిధ గ్రామాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలంలోని మీసన్‌పల్లి, ఆజామాబాద్, మత్తమాల రైతు వేదికలలో సోమవారం సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతుల ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈసమావేశంలో రైతుల సలహాలను, సూచనలు సేకరించారు. ఎక్కువ మంది రైతులు పది ఎకరాల లోపు పంట సాగు చేసే భూములకు మాత్రమే రైతు భరోసా అందించాలని అభిప్రాయాలు ఎక్కువ వ్యక్తమయ్యాయి. ఈసందర్భంగా సహకార సంఘం ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను సూచనలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శులు విశ్వనాథం, పెంటయ్య, రామచందర్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**మద్నూర్:** ఉమ్మడి మద్నూర్ మండలంలో జూలై 3న రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సొసైటీల కార్యదర్శులు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతు బంధు (రైతు భరోసా) పథకం అమలుపై రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా సహకార సంఘాల్లో ప్రత్యేక సర్వసభ్య సమావేశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర సహకార శాఖ డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ కావడంతో మద్నూర్, డోంగ్లీ సింగిల్ విండో సొసైటీలలో ఈనెల 3న సమావేశం ఏర్పాటు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున అందించింది. కాగా తాము అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. దాని అమలు చేయడం కోసం ప్రస్తుతం కసరత్తు ప్రారంభించింది.

● ఎన్ని ఎకరాలకు ఇవ్వాలి?

గత ప్రభుత్వం ఎటువంటి పరిమితులు, కొర్రీలు లేకుండా అందరికీ రైతు బంధు అందించింది. వ్యవసాయం చేయని వారికి, సాగులు లేని గుట్టలు, బీడు బడిన భూములకు సైతం రైతు బంధు వచ్చింది. అంతేకాకుండా యాభై, వంద ఎకరాలు ఉన్న వారికి కూడా రైతు బంధు అందింది. దీనిపై అప్పట్లో రైతులు, ఇతర వర్గాల నుంచి కొంత వ్యతిరేకత వచ్చిన అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా దీనిపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టిసారించింది. పెద్ద రైతులకు రైతు భరోసా ఇవ్వాలా, వద్దా? ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలి? సాగులో లేని భూములకు ఇవ్వాలి, వద్దా? అన్న అంశాలపై రైతుల నుంచి సలహాలు, సూచనలను తీసుకోవాలని నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల రైతు వేదికల్లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల నుంచి సలహాలు తీసుకున్నారు. ఇదే క్రమంలో పెద్ద సంఖ్యలో రైతుల అభిప్రాయలను తీసుకుని రైతు భరోసా అమలుపై స్పష్టమైన విధి విధానాలను ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. అందుకు గానురైతులతో సమావేశాలను ఏర్పాటు చేసిన సమావేశాల్లోనే తీర్మానాలుచేసి అదే రోజు రాష్ట్ర సహకార శాఖ డైరెక్టర్‌కు నివేదిక రూపంలో పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## పాముకాటుతో మహిళ మృతి



మృతి చెందిన నూనవత్ జనవ్వ, పాము నల్లత్రాచు

లింగంపేటరూరల్, జూలై 1: మండలంలోని కన్నాపూర్ తండాలో సోమవారం పాము కాటుతో నూనవత్ జనవ్వ(41) మృతి చెందినట్లు తండా వాసులు తెలిపారు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రిస్తుండగా రాత్రి 11గంటల ప్రాంతంలో ఏదో కరిచినట్లు అనిపించి మేలుకువ వచ్చి చూడాగా అక్కడే పాము కనిపించడంతో కుటుంబ సభ్యులను లేపి పామును చంపినట్లు వారు తెలిపారు. ఆమెను కరిచింది నల్లత్రాచు పాముగా గుర్తించి వెంటనే ఆమెను కామారెడ్డిలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని వారు తెలిపారు.

## భిక్కనూరులో ఒకరి అదృశ్యం

భిక్కనూరు, జూలై 1: మండల కేంద్రానికి చెందిన ఒకరు అదృశ్యమైనట్లు భిక్కనూరు ఎస్సై సాయి కుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తాటిపాముల శేఖర్‌గౌడ్ ప్రింటింగ్ ప్రెస్ నడుపు కుంటూజీవనం సాగిస్తున్నాడు.ప్రతీ రోజులాగానే గత నెల 29న ఉదయం ప్రిటింగ్‌ప్రెస్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన అతడు కన్పించకుండా వెళ్లిపోయాడు. ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తోందని, బంధువులు, తెలిసినవారి వద్ద ఎంత వెతికిన ఫలితం లేకపోవడం అతడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆర్పీలు కలిసికట్టుగా పనిచేయాలి: ఇందుప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, జూలై 1:కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మెప్మా అధికారులు,ఆర్పీలతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వసర్వేలు పకడ్బందీగా చేపట్టడంతో పాటు మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేలా సల హాలు,సూచనలు అందించాలని వారికి రుణాలు సకాలంలో అందేలా చూ డాలని సూచించారు. మెప్మా మున్సిపల్‌కి ఒక కుటుంబం లాంటిది కాబట్టి అందరూ ఆర్పీలు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెప్మాపీడీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత,డీఈవోలు జీవిత, అనసూయ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా రోహిత్‌రెడ్డి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రోహిత్‌రెడ్డి

కామారెడ్డిరూరల్,జూలై 1:కామారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి అధికారిగా రోహిత్‌రెడ్డి బాధ్యతల స్వీకరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా ఉన్న డా.కె.సింహరావు రిటైర్డ్ అవ్వడంతో బాన్స్‌వాడ ఏడీ (ఏవియచ్)గా ఉన్న యం.రోహిత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించి సిబ్బందికి పలు అంశాలపై చర్చించి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.ప్రతిఒక్కరు పనివేళలు పాటించాలని విధులపట్ల చిత్తశిద్ధితో పనిచేయాలని శాఖ మంచి పేరు తేవాలని రైతుల సమస్యల పట్ల ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.పశువ్యాధులకు సకాలంలో టీకాలు వేసి నివారించాలన్నారు.

## జిల్లాస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్

కామారెడ్డిరూరల్,జూలై 1:కామారెడ్డి జిల్లా అథెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కిడ్స్(8,10,12 సంవత్సరాల బాలబాలికలు)లకు ఎంపిక 04 జూలై 2024 గురువారం ఉదయం 8 గంటలకు స్థానిక ఇందిరాగాంధీ స్టేడియం నందు 50మీటర్లు,100మీటర్లు, 300మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు,లాంగ్‌జంప్,స్టాడింగ్ బోర్డ్‌జంప్ అంశాలలో పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి డా.అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ మీ-సేవ కేంద్రం నుంచి పొందిన వయస్సు ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌ను క్రీడ దుస్తులు,షూస్ తీసుకోని వచ్చి పాల్గొనవలెనని తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

రామారెడ్డి, జూలై 1:రామారెడ్డి ఎమ్మార్పీఎస్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇసుగుర్తి, ఉపాధ్యక్షుడిగా సాయిలు,ప్రధానకార్యదర్శి దుబ్బాక లక్ష్మీనారాయణ,మహిళ కమిటీ విభాగం అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు మానస, మండల కమిటీ కార్యవర్గ సభ్యులు రాజశేఖర్,రమేష్,శ్రీనివాస్, కిషన్, సుంకపల్లి రాజయ్య,సాయిలు, రాజారం, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రమాజీ కార్యదర్శి బట్టువెంకట్రాములు, జిల్లా మహిళ అధ్యక్షురాలు లక్ష్మీ, కామారెడ్డి జిల్లా ఎంఆర్పీస్ కార్యదర్శి యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ పీహెచ్‌సీలో అమ్మఒడి



గర్భిణులను పరీక్షిస్తున్న దృశ్యం

బీర్కూర్,జూలై1: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అమ్మఒడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు.ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి వైద్యులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గిరీష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రీతి, నరేందర్, రమ్యశ్రీ తదితరులు ఉన్నారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవీందర్

నాగిరెడ్డిపేట, జూలై 1: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్‌లో శనివారం జరిగిన హత్య కేసులో నిందితుడైన కొడిపాక వెంకటేశంను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యకు ఉప యోగించిన టవాల, కర్రను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఎస్ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘ అధ్యక్షుడిగా రాజనర్సు

దోమకొండ, జూలై 1: దోమకొండ మత్స్య సహకార సంఘం అధ్యక్షునిగా మామిళ్ల రాజనర్సు గెలుపొందారు. ఎన్నికలు నిర్వహించగా రాజనర్సు సమీప ప్రత్యర్థి కొండ లక్ష్మీనారాయణపై 31 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. రాజనర్సుకు 78 ఓట్లు రాగా లక్ష్మీనారాయణకు 47 ఓట్లు ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా రాజనర్సు మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలిపించినందుకు మత్స్యకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలలో రాళ్లు వేసిన వారిపై కేసు నమోదు



పగలగొట్టిన టీవీని పరిశీలిస్తున్న ఎస్ఐ

గాంధారి, జూలై 1:మండలంలోని గండివేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రాళ్లు విసిరిన వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం పాఠశాల గదులను తాళాలు వేసిన ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలకు వచ్చిచూసేసరికి 8 వతరగతి గదిలో రాళ్లుఉండడంతో పాటు టీవీ పగిలిపోయి ఉందని తెలిపారు.దీంతో ఇన్‌చార్జి ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్ ఫిర్యాదు ఇవ్వగా నూతన చట్టం భారతీయన్యాయసంహిత ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐతెలిపారు.కొత్తచట్టం వల్ల శిక్షలుపెరగడం వల్ల నేరాలు తగ్గుతాయని తెలిపారు.

## పోచారాన్ని కలిసిన నాయకులు



పోచారం కలిసిన దేశాయిపేట్ గ్రామ నాయకులు

బాన్సువాడ, జూలై 1: బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సోమవారం బాన్సువాడ పట్టణానికి విచ్చేసిన సందర్భంగా బాన్సువాడ మండలం దేశాయ్‌పేట్ గ్రా మానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రావణ్‌తో పాటు గ్రామ నాయకులు పట్టణంలోని ఎమ్మెల్యే పోచారం స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు, శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం, బాన్సువాడ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి మారడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రత్నాకర్, ప్రశాంత్, గంగారాం, సాయబ్‌రావు, సుధాకరప్ప తదితరులు ఉన్నారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం



ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, జూలై 1: బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం కాంగ్రెస్ నాయకులు డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ ను శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్ బాన్సువాడ ప్రజలకు చేస్తున్న వైద్య సేవలు అనిర్వచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు అక్బర్ తదితరులున్నారు.

**బీర్కూర్:** బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీర్కూర్ లయన్స్ క్లబ్ కార్యాలయంలో సోమవారం బీర్కూర్ పీహెచ్‌సీ వైద్యా ధికారితో పాటు స్థానికంగా సేవలు అందిస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యులకు లయన్స్ అధ్యక్షుడు మేకల గాలయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అ.ధ్యక్షుడు గాలయ్య, సభ్యులువిఠల్, అశోక్, రషీద్, శ్రీని వాస్, కిషోర్,సంతోష్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

**రామారెడ్డి:** జాతీయ డాక్టర్స్‌డే సందర్భంగా రామారెడ్డి పీహెచ్‌సీలో వైద్యులు సురేష్, చైతన్యలను స్విం ది సన్మానించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే ప్రజలకుమెరుగైన సేవలను అందించనప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భీమ్,స్టాఫ్ నర్సులు,ఫార్మాసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

**లింగంపేటరూరల్:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందుతో పాటు ఆమె భర్త వైద్యుడు అజయ్‌కుమార్‌ను సోమవారం డాక్టర్స్ డే సం దర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స న్మానించారు.ఈసందర్భంగా హిమబిందు మాట్లాడుతూ వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని ధనిక, పేద,కుల, మత అనే తేడా లేకుండా అందరికి సమానమైన వైద్య సేవలు అందించి పేదలఆరోగ్యం కోసం కృషిచేస్తామని ఆమెతెలిపారు.కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శ్రీకాంత్, వివేకానంద, నర్సింలు,బాలకిషన్‌లు ఉన్నారు.

## యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా అరవింద్ నియామకం

సదాశివనగర్, జూలై 1:సదాశివనగర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా అరవింద్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసేని భువనేశ్వర్ బదిలీపైవెళ్లారు. ఎన్నో సంవత్సరాలుగా సదాశివనగర్ యూనియన్ బ్యాంకులో భాషాసమస్య వల్లఅనేక ఇబ్బందులకు గురైన ఖాతాదారులు వరంగల్‌కు చెందిన అరవింద్ రావడం ఆయనకు తెలుగు స్పష్టంగా రావడంతో ఇబ్బందులు తొలగనున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.ఖాతా దా రులు ఎలాంటి దళారి వ్యవస్థను ప్రోత్సహించకుండా నేరుగా తమ వద్దకు వచ్చి సమస్యలు తెలుపుకోవాలని సూచించారు.పంటరుణాలలో కాని ఇతర రుణాల లో కాని ఖాతాదారులు దళారులను నమ్మిమోస పోవద్దని తెలిపారు.



## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| శాంతి | - ఓసీ |
| దర్శన్ | - కల్కి |
| ప్రియా 70 | - కల్కి |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | - కల్కి |
| వెంకటేశ్వర | - మహారాజ |

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 160 | 200 | 220 |
| వెన్‌కాబ్(కిలో) | : | 170 | 220 | 230 |

